క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోండి

లింగాల: మండలంలోని వల్లభాపూర్ రైతువేదికలో శుక్రవారం రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులు ఏఓ నాగార్జునరెడ్డి స్వీకరించారు. జూన్ 28వ తేదీ నాటికి కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆగస్టు 4వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఏఈఓ శ్రీనిధి, రైతులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల రైతులు రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ సాయిరమేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పండ్లసాగు లాభదాయకం

అమ్రాబాద్: పండ్లసాగులో లాభాలు గడించవచ్చని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సృజనబాలచంద్రుడు అన్నారు. శుక్రవారం మండలంలోని జంగంరెడ్డిపల్లిలో ఉన్న ప్రకృతి వనం నర్సరీని, గ్రామంలో చెంచు రైతులు సాగుచేసిన పండ్ల మొక్కల కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎంపీడీఓపాటు ఈజీఎస్ ఈసీ రేణయ్య, టీఏ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి రాజారాంనాయక్ ఉన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

కోడేరు: మండలానికి బదిలీపై వచ్చిన ఎస్‌ఐ గోకారిని శుక్రవారం మండల నాయకులు దూరెడ్డి సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అశోక్, రామకృష్ణ, జేసీబీ రమేష్, వడ్డే బోజన్న తదితరులు సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతి భద్రతలకు పోలీస్ సిబ్బందికి నాయకులు సహకరించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొల్లాపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యానాగరాజు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని మినీ స్టేడియంలో కమిషనర్‌తో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. చెట్లతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మహిమూదాబేగం ఖాదర్‌పాషా, కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు రహీం పాషా, డాక్టర్ రాముడుయాదవ్, కర్నె అలివేల, నాయకులు పాల్గొన్నారు.

వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలి

పెద్దకొత్తపల్లి: అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. ఎమ్మెల్యే సేవలను గుర్తించి మంత్రి పదవి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాల మహానాడు అధ్యక్షుడు యాదగిరి, సలహాదారుడు లక్ష్మణస్వామి, కార్యదర్శి కురు మయ్య, సుబ్బయ్య, భగవంత్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సూర్య శ్రీనివాస్‌గౌడ్ ఉపాధ్యాయులచే సభ్యత్వ నమోదు చేయించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు, జహంగీర్, పూర్ణస్వామి, రాములు, సాజిద్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్‌తిరుమలాపూర్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును శుక్రవారం మండల అధ్యక్షుడు రాఘవేందర్ ప్రారంభించారు. ప్రధాన కార్యదర్శి కృపేందర్‌రావు, జిల్లా కార్యదర్శి ముస్తాక్‌అహ్మద్, లక్ష్మీనారాయణ, యశ్వంత్, మధు, సురేష్, ఆచారి పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో..

బల్మూర్: మండలంలోని కొండనాగుల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త శ్రీధర్ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి, పాండు, సందరయ్య, కాశన్న, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆషాడం.. గోరింటాకు సంబరం



ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని కొల్లాపూర్ మండలం సింగోటంలో శుక్రవారం గోరింటాకు పండుగను మహిళలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఒకే రంగు చీర ధరించి చేతులకు గోరింటాకు పెట్టుకొని సందడి చేశారు. వర్షాలు బాగా కురవాలని.. పంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు చేశారు.

–కొల్లాపూర్ రూరల్

ముగిసిన కొడి పీర్ల పండుగ

కోడేరు: మండల కేంద్రంలో కొడి పీర్ల వేడుకలు శుక్రవారంతో ముగిసాయి. చివరి రోజు గ్రామంలో పీర్లను ఊరేగించారు. చిన్నారులు, యువకులు నృత్యాలు చేశారు. అనంతరం గ్రామ శివారులో పీర్లను నిమజ్జనం చేశారు.

కార్గిల్ అమర వీరులకు నివాళి



లింగాలలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



అచ్చంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం విద్యార్థి సేన, యువసేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ మాట్లాడారు. 1999 సంవత్సరంలో దాదాపు 60 రోజుల పాటు భీకరంగా జరిగిన కార్గిల్ యుద్ధంలో దేశ సైనికుల వీర మరణం పొందారని వారి త్యాగం ఎన్నటికీ మరువలేనిదన్నారు. అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో యువసేన రాష్ట్ర కార్యదర్శి సాయి, రాష్ట్ర నాయకులు వినోద్, అజయ్, మారుతి, విష్ణు, వెంకటేష్ పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ పోరాటంలో అమరులైన జవాన్లకు ఘన నివాళులర్పించారు. అదే విధంగా సప్త శిక్షణ దివాస్‌లో భాగంగా మండల కేంద్రంలో ఉన్న పలు పురాతన కట్టడాలను సందర్శించి కట్టడాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బషీర్ అహ్మద్, ఉపాధ్యాయులు కొండయ్య, పురుషోత్తం, వెంకటేశ్వర శర్మ, శంకరయ్య, నరసింహ్మ, రామచంద్రం, ధరమ్‌సింగ్, కవిత, రాణి, మహేశ్వరీ, యాదమ్మ, సుజాత, ఫర్హానాబేగం తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్‌లోని న్యూమూన్ స్కూల్ ప్రైవేట్ పాఠశాలలో కార్గిల్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. సైనికుల వేషధారణలో వంద అడుగుల జాతీయ పతాకాలతో విద్యార్థులు ప్రదర్శించారు. పాకిస్థాన్ మూకలతో భారత సైన్యం వీరోచిత పోరాటాన్ని కొనియాడారు. మూడు నెలలపాటు జరిగిన ఆ యుద్ధంలో 500ల మందికి పైగా జవాన్లు అమరులైనట్లు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ అజిమోద్దీన్, హెచ్‌ఎం ఉప్పరి బాల్‌రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కేసులపై వెల్గొండ గ్రామస్తుల ధర్నా



బిజినేపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

నాగర్‌కర్నూల్: బిజినేపల్లి మండలానికి చెందిన ఓ విలేకరి, జిల్లాకేంద్రానికి చెందిన మరో విలేకరి బిజినేపల్లి ఎస్‌ఐ నాగశేఖరరెడ్డిపై ఒత్తిడి చేసి అమాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, వీరి అరాచకాలను అరికట్టాలని వెల్గొండ గ్రామస్తులు శుక్రవారం మండలకేంద్రంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఇద్దరు విలేకరులు అమాయకులపై వార్తలు రాసి వారిపై పోలీస్‌స్టేషన్‌లో బలవంతపు కేసులు నమోదు చేయిస్తున్నారని, ఇలాంటి దుశ్చర్యల వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించింది నేనే అని చెప్పుకుంటూ.. తమ గ్రామానికి చెందిన మరో ముగ్గురుతో కలిసి అమాయకులను వేధిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల గ్రామానికి చెందిన మాజీ రౌడీషీటర్ బీరయ్యతో కలిసి అతని అన్న కుండేళ్ల రాజుపై అక్రమ కేసు పెట్టించి.. అతని ఆత్మహత్యకు పరోక్షంగా కారణం అయ్యారన్నారు. ఈ క్రమంలోనే తమ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని మహిళతో ట్రాప్ చేయించి అత్యాచారం కేసు పెట్టించారన్నారు. అదే విధంగా గ్రామానికి చెందిన మరో యువకుడిపై ఓ మహిళతో ఎస్సీ అట్రాసిటీ, రేప్ కేసుపై ఫిర్యాదు చేశారని, ఫిర్యాదు ఆధారంగా ఇద్దరు విలేకరులు వార్త రాసి.. వాటిని వైరల్ చేసి పోలీసులతో కేసు నమోదు చేసేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారి వల్ల గ్రామంలో భయానక వాతావరణం నెలకొందని, అక్రమ కేసులు పెట్టించడం నైజంగా మారిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి హామీతో ధర్నాను విరమించారు. అక్కడి నుంచి జిల్లాకేంద్రానికి చేరుకుని డీఎస్పీ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.

పాఠశాల ఎదుట ఆందోళన



కోమటికుంట పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

లింగాల: మండలంలోని కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట శుక్రవారం విద్యార్థులతో కలిసి గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. పాఠశాలలో హెచ్‌ఎంతో పాటు మరో నలుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. బదిలీల్లో భాగంగా అందరిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో గ్రామస్తులు దీనితో ఉపాధ్యాయులు లేని పాఠశాలగా మారింది. విద్యార్థుల చదువులు అర్థాంతరంగా నిలిచిపోకుండా హెచ్‌ఎంతో పాటు మరో ఉపాధ్యాయుడిని కొన్ని రోజుల పాటు పనిచేయాలని డీఈఓ ఆదేశించారు. పాఠశాలలో 70కి పైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ చంద్రుడుని వివరణ కోరగా పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయ పోస్టలను తాత్కాలికంగా భర్తీ చేస్తామని తెలిపారు. బదిలీ అయిన హెచ్‌ఎంను ఇక్కడే కొనసాగిస్తాం. మరో ముగ్గురిని డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలల నుంచి నియమిస్తాం.

బొందలపల్లిని సందర్శించిన సీపీఎం బృందం



నాగర్‌కర్నూల్‌రూరల్: గ్రామాల్లో సమస్యలను తెలుసుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల అధ్యయన కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని బొందలపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు గ్రామస్తులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అశోక్, మాజీ ఉపసర్పంచ్ మధు, సీపీఎం నాయకులు సుభాష్, సురేష్, నరేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన జడ్జి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని సబ్ జైలును శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి సబిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహారపదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో నేరాలు చేసి జీవితాలు నాశనం చేసుకోవద్దని తెలిపారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ నాగరాజు ఉన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా లక్ష్మణ్‌నాయక్

ఊర్కొండ: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా లక్ష్మణ్ నాయక్ శుక్రవార బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో విజయ్ దేవరకద్రకు బదిలీ అయ్యారు. తాడూరు నుంచి ఊర్కొండకు లక్ష్మణ్‌నాయక్ బదిలీపై వచ్చారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



తాడూరు: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీఓగా బ్రహ్మచారి అన్నారు. శుక్రవారం తిరుమలాపూర్, చర్లటిక్యాల గ్రామాలను ఆయన సందర్శించి గ్రామసభ నిర్వహించారు. మురుగు కాల్వలు, ట్యాంక్‌లను శుభ్రం చేయాలని కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో ఆయా గ్రామాల ప్రజలు, కార్యదర్శి చైతన్య పాల్గొన్నారు.

బడ్జెట్‌లో దళితబంధుకు నిధులు ఏవి?

కల్వకుర్తిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితబంధుకు ఎందుకు నిధులు కేటాయించలేదని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి పరశురాములు ప్రశ్నించారు. శుక్రవారం కల్వకుర్తిలో కేవీపీఎస్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 18 శాతం దళితులు ఉంటే కేవలం 15 శాతం మాత్రమే నిధులు కేటాయించడం దారుణమన్నారు. జనాభాప్రాతిపదికన నిధులు కేటాయించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో కురుమయ్య, మాధవులు, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి

తెల్కపల్లి: వన మహోత్సవంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని మండల ప్రత్యేకాధికారి రాంలాల్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యదర్శులకు ఉపాధిహామీ సిబ్బంది వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. ఎంపీఈఓ లింగయ్య గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో వన మహోత్సవం



ఉప్పునుంతల: స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా వన మహోత్సవం నిర్వహించారు. కేజీబీవీ స్పెషలాఫీసర్ సైదా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు మొక్కలు నాటారు. ఏబీవీపీ మండల కార్యదర్శి పాత్కుల శివ, సంయుక్త కార్యదర్శి మొగిలి శివ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఏఓకు వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: ఇటీవల ప్రభుత్వం సాధారణ బదిలీలలో భాగంగా బదిలీ చేసిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని తపస్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ ఏఓ చంద్రశేఖర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం జిల్లా విద్యాధికారి గోవిందరాజులకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి, ఎస్ వెంకట్‌రెడ్డి, వనమోని శేఖర్, కార్యవర్గ సభ్యులు జగదీశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు..

కోడేరు: మండల కేంద్రంలోని బాలికల గురుకుల హాస్టల్‌లో డ్రైయినేజీ పనులను పూర్తి చేయలని ఎస్ఎఫ్‌ఐ మండల నాయకులు రాజేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. శ్రీకాంత్, బి.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ ఇవ్వాలని..

వెల్దండ: కళాశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర నాయకుడు సంతోష్, అర్జున్, నితిన్, పవన్, అనిల్, మల్లేష్, తదితరులు ఉన్నారు.

మండల కమిటీ ఎన్నిక

వెల్దండ: సైనికుల సంక్షేమ సంఘం మండల కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం. చంద్రశేఖర్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా వై. వెంకట్‌రెడ్డి, డి. యాదయ్య, ఉపాధ్యక్షుడిగా పురుషోత్తంచారి, జనరల్ సెక్రెటరీ టి. ప్రవీన్ కుమార్‌రెడ్డి, భీమయ్య, ఆర్. తిరుపతయ్య, ఆర్. శ్రీనివాసులు, వెంకటేష్, తదితరులు ఉన్నారు.

శిథిలావస్థ పాఠశాలలను గుర్తించాలి

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలోని శిథిలావస్థ పాఠశాలలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ జ్యోతిపరాసియా కోరారు. శుక్రవారం మండలంలోని ఎంగంపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పాఠశాల భవనం బాగాలేదని విద్యార్థులను ఇతర గదుల్లోకి పంపించాలని సూచించారు.

విజయవంతం చేయండి

తాడూరు: ఈ నెల 26, 27న ఉమ్మడి జిల్లా కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని డీహెచ్‌పీహెచ్ అధ్యక్షుడు భరత్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శివుడు, భార్గవ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బ్యాండ్‌సెట్ వితరణ

తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు జంది ప్రేమ్‌చందర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గ్రామానికి చెందిన ఆయన తండ్రి నర్సింహారెడ్డి రూ. 8500 విలువ చేసే బ్యాండ్‌సెట్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో వాస రాఘవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లొద్దు

పెంట్లవెల్లి: మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ఎస్‌ఐ రామన్‌గౌడ్ సూచించారు. మండలంలోని మంచాలకట్ట మత్స్యకారులకు శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జటప్రోల్, మంచాలకట్ట, మల్లేశ్వరం, సోమశీల, వేముకల్ వంటి గ్రామాల్లో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను విస్మరించడం తగదు



కల్వకుర్తిరూరల్: బడ్జెట్‌లో బీసీలకు నిధులకు కేటాయించకుండా విస్మరించడం తగదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్యయాదవ్, రాష్ట్ర బీసీసేన అధ్యక్షుడు కృష్ణయాదవ్‌లు అన్నారు. శుక్రవారం పట్టణంలో బీసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 శాతం ఉన్న బీసీలకు 3 శాతంలోపే బడ్జెట్ కేటాయించడం సరికాదన్నారు. సమావేశంలో నిరంజన్, మల్లేష్‌గౌడ్, నిరంజన్‌యాదవ్, అరవిందాచారి, సుధాకర్‌గౌడ్, లక్ష్మయ్యగౌడ్ పలువురు పాల్గొన్నారు.

ఉచిత విద్యపై జీఓ జారీకి కృషి

అచ్చంపేట రూరల్: జర్నలిస్టు కుటుంబాల పిల్లల కోసం ప్రభుత్వమే ఒక జీఓను విడుదల చేసి ఉచిత విద్యను అందించేలా టీయూడబ్ల్యూజే(ఐజేయూ) కృషి చేస్తోందని రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. ఈ విషయమై త్వరలోనే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ సూచన మేరకు ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించనున్నారన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రెస్ అకాడమీ ద్వారా రాష్ట్రంలో మొదటిసారిగా నల్లమల ప్రాంతంలో శిక్షణా తరగతులు నిర్వహించడానికి ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములునాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్ణయ్య, కౌన్సిల్ సభ్యుడు శ్యాంసుందర్, మాధవరెడ్డి, పవన్‌కుమార్, శేఖర్, కృష్ణయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

నిధుల దుర్వియోగంపై విచారణ

అమ్రాబాద్: నిధుల దుర్వినియోగంపై జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, డీఎల్‌పీఓ వెంకటయ్యతో కలిసి విచారణ నిర్వహించారు. పదర మండలం వంకేశ్వరం గ్రామ పంచాయతీ కార్యదర్శి 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.80,500 దుర్వియోగం చేశాడని మాజీ సర్పంచ్ దశరథ్‌నాయక్, డిప్యూటీ సర్పంచ్ చంద్రమౌళిలు ఫిర్యాదు చేయడంతో డీపీఓ గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో కొంత మంది గ్రామస్తుల సమక్షంలో విచారణ చేశారు. పూర్తి విచారణ చేసి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'మాజీ సీఎం వ్యాఖ్యలు సరికావు'



అచ్చంపేట: గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాలతో తెలంగాణ ఆకాంక్షలు నెరవేరలేదని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ విషయంలో మాజీ సీఎం చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మేము ఇచ్చిన హామీలు, మా ప్రాధాన్యతలు వేరు.. మీ హామీలు వేరన్నారు. మీ హయాంలో అమలు చేసిన పథకాలు మేము అమలు చేస్తామని ఎక్కడా చెప్పలేదని, ఈ చిన్న లాజిక్ మాజీ సీఎం కేసీఆర్ మరచి బడ్జెట్‌లో దళిత బంధు, గొర్రెల పథకం ప్రాస్తవన లేదని చెప్పడం విడ్డురంగా ఉందన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం కింద చేపట్టిన ప్రాజెక్టులు తప్పా.. బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరులో చేపట్టింది ఒక్కటీ లేదన్నారు. గత ఎమ్మెల్యే గువ్వల ఈ ప్రాంతంలో 60 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆర్భాట ప్రకటనలు చేశారని, కేఎల్‌ఐ ద్వారా 6 వేల ఎకరాల కంటే ఎక్కువ నీరు అందినట్లు రుజువు చేయాలని సవాల్ విసిరారు.

వరి నాట్లతో సీపీఎం నిరసన



బల్మూర్: మండలంలోని కొండనాగుల దళిత కాలనీలు సీసీ రోడ్లకు నోచుకోవడం లేదని నిరసిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి రోడ్లపై వరి నాట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు భాస్కర్ మాట్లాడారు. గ్రామంలో అంతర్గత రహదారులు సీసీలకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు లక్ష్మయ్య, గంగయ్య, శివకుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా గురుస్వామి

బల్మూర్: మండల ఎస్‌ఐగా గురుస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతిభద్రతల సమస్యలపై ప్రజాప్రతినిధులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

కల్వకుర్తిరూరల్: మండలంలోని రఘుపతిపేట, తెలకపల్లి ప్రధాన రహదారిపై దుందుబీనదిపై బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు మాట్లాడుతూ వర్షాకాలంలో వాగు ఉధృతి కొనసాగితే వాహనదారుల, బస్సుల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో అశోక్, లక్ష్మయ్య, అంజయ్యగౌడ్, పరుశరాములు, బాల్‌రెడ్డి, శేకర్ తదితరులు పాల్గొన్నారు.

వెండి ఆభరణాలు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: పీర్ల చావిడి వద్ద 35 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైన ఘటన జిల్లా కేంద్రంలోని సంతబజారులో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం సంతబజారులో ఏర్పాటు చేసిన పీర్ల వద్ద 35 తులాల వెండి ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం ఈ చోరీపై నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన నాయకులు



కొల్లాపూర్: కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను శుక్రవారం ఢిల్లీలో బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు టి.ఆచారి కలిశారు. జడ్చర్ల–నంద్యాల మధ్య కొల్లాపూర్ మీదుగా రైల్వేలైన్ నిర్మించాలని వారు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. రైల్వే లైన్ నిర్మాణం ఆవశ్యకత, దానివల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలు, రవాణా సౌకర్యాల గూర్చి వివరించారు. త్వరలోనే రైల్వేలైన్ ఏర్పాటుకు సంబంధించి సర్వే చేయిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు ఎల్లేని సుధాకర్‌రావు తెలిపారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఈఎఫ్‌ఐఎస్ చైర్మన్ బి వెంకట్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాబుజగ్జీవన్‌రాం కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కెనరాబ్యాంక్ మేనేజర్ రమేష్, తళారి రాజు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

అమ్రాబాద్: హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన అమ్రాబాద్ ఎస్టీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. 123 మంది విద్యార్థులు రెండు బాత్‌రూంలే ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల అధ్యక్షుడు గోలి రాజు నాయకులు విక్రమ్, శివ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై సర్వే

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సమస్యలపై సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్, సుల్తాన్, ఉదయ్, శివ, అఖిల్, అనీల్, హేమ, ఉష పాల్గొన్నారు.

అభ్యాసన ఫలితాల సాధనపై శిక్షణ

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక నేషనల్ హైస్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయులకు అభ్యాసన ఫలితాల సాధనపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంఓ షర్ఫోద్దీన్ పాల్గొని ఉపాధ్యాయులకు శిక్షణను ఇచ్చారు. గణితం, పరిసరాల విజ్ఞానం, తెలుగు, ఇంగ్లీష్ తదితర సబ్జెక్టులలో ఫలితాలు సాధించే విషయమై సంసిద్ధత ప్రణాళికను తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజులు, సబ్‌జెక్టుల వారిగా రీసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.